క్లుప్తంగా

గ్రామాలకు చేరిన శ్రీరాముని అక్షింతలు



అక్షింతలతో తమ్మినాయుడుపేట, ధర్మవరం భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: అయోధ్య శ్రీరాముని ఆలయం నుంచి వచ్చిన పూజిత అక్షింతలు ధర్మవరం, తమ్మినాయుడుపేట గ్రామాలకు ఆదివారం చేరాయి. వీటిని ఎచ్చెర్ల మండలానికి సంబంధించి కుంచాలకుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో భద్రపర్చి, గ్రామాల్లోని భక్తులకు అందజేస్తున్నారు. గ్రామం యూనిట్‌గా ప్రతి ఇంటికీ అక్షింతలు చేర్చేందుకు కమిటీ సభ్యులు చర్యలు తీసుకుంటున్నాయి. అక్షింతలను గ్రామాల్లో ప్రత్యేక భజన కార్యక్రమాలతో ఊరేగిస్తున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముని పాపారావు అక్క అప్పయ్యమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట లావేరు పీఏసీఎస్ అధ్యక్షులు బూరాడ చిన్నారావు, నాయకులు దొంక వెంకట రమణ ఉన్నారు.

ధనుర్మాస వ్రతం పరమ పవిత్రం



ఆధ్యాత్మిక గోష్టిలో భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధనుర్మాస వ్రతం పరమ పవిత్రమైనదని విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు గురుగుబెల్లి లక్ష్మీనారాయణ అన్నారు. ఫరీదుపేటలోని శ్రీరామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం అళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రవచన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ధనుర్మాస వ్రత ప్రాధాన్యతపై ఉపన్యసించారు. ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం సాధ్యమన్నారు. ప్రతిఒక్కరూ ధనుర్మాస నీతి నియమాలు పాటించి దేవుని మోక్షం పొందాలని చెప్పారు. దేవుని అనుగ్రహం పొందాలంటే వ్యక్తిత్వంలో చిత్తశుద్ధి అవసరమన్నారు. భోగి పండుగతో ధనుర్మాస వ్రతం, తిరుప్పావై ప్రవచనాలు ముగుస్తాయని వెల్లడించారు. ఆలయ అర్చకులు అంపోలు వైకుంఠస్వామి, భక్తులు పాల్గొన్నారు.

విలువలతో కూడినది భగవద్గీత



భగవద్గీత శ్లోకాలు నేర్పుతున్న స్వామీజీ

శ్రీకాకుళం కల్చరల్: విలువలతో కూడిన గ్రంథం భగవద్గీత అని చిన్మయమిషన్ నిర్వాహకులు పరాత్మానంద సరస్వతి స్వామి అన్నారు. బలగలోని హరే రామ మందిరంలో ఆదివారం భగవద్గీత శ్లోకాలను చిన్నారులతో పఠనం చేయించారు. ఈ సందర్భంగా చిన్మయా మిషన్ ప్రతినిధి కూనపులి వెంకటేశ్వరులు మాట్లాడుతూ ప్రతి ఆదివారం జరిగే ఈ కార్యక్రమానికి ఎవరైనా తమ పిల్లలను పంపించవచ్చని తెలిపారు.

అపరాలకు మంచుదెబ్బ



సాగులో ఉన్న మినుముపంట

జి.సిగడాం: దట్టంగా కురుస్తున్న మంచుతో అపరాల పంటలకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా తేనె మంచు కురవడంతో పెసర, మినుము, ఉలవ పంటలపై ప్రభావం చూపుతోందని రైతులు చెబుతున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో సుమారు ఐదువేల ఎకరాల్లో అపరాలను రైతులు సాగు చేస్తున్నారు.

సక్రమంగా ధాన్యం కొనుగోలు

జి.సిగడాం: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు రైతుభరోసా కేంద్రాల్లో పని చేస్తున్న ప్రతి అగ్రికల్చర్ అసిస్టెంట్ సక్రమంగా పని చేయాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే విషయమై జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు సకాలంలో ధాన్యం డబ్బులను వారి బ్యాంకు అకౌంట్లలో జమ చేస్తామన్నారు.హెచ్చిరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతాలు



గుడివీధిలో అభయాంజనేయునికి పూజలు



పాతశ్రీకాకుళంలో పంచముఖ ఆంజనేయ స్వామి



గుజరాతిపేట శక్తిపథ ఆంజనేయస్వామి ప్రత్యేక అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్:

మార్గశిర శుద్ధ త్రయోదశి పురస్కరించుకొని ఆదివారం పలు ఆంజనేయస్వామి ఆలయాలలో హనుమత్ వ్రతాలు, హోమాలు, సింధూరార్చనలు, తమలపాకు అర్చనలు వైభవంగా నిర్వహించారు. గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ వ్రతాలు జరిగాయి. అర్చకులు కోసూరు మాధవరావు ఆధ్వర్యంలో పాలాభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, హరగోపాల్‌శర్మ, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

– గుజరాతిపేటలోని జగన్నాథస్వామి ఆలయం వద్ద శక్తిపథ ఆంజనేయునికి గారెలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా తయారు చేసిన దండలతో అలంకరించారు. అర్చకులు పెంట సోదరుల నేతృత్వంలో స్వామివారికి నిజరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. అనంతరం క్షీరాభిషేకాలు, తమలపాకుల పూజలు, సింధూరార్చనలు జరిగాయి. పలువురు భక్తులు ఆంజనేయ మాల ధరించారు.

పంచముఖ ఆంజనేయునికి వ్రతాలు..

పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న పంచముఖాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అభిషేకాలు, సహస్ర తమలపాకులతో అర్చనలు, సామూహిక వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఎల్.నందికేశ్వరరావు, రామలింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతాజయంతి వేడుకలు



భగవద్గీత పోటీల విజేతలతో నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: మన తలరాతను మార్చే ఉత్తమ గ్రంథం భగవద్గీత అని, ప్రతి ఒక్కరు చదవాల్సిన గ్రంథమని పి.టి.జి.వి.రంగాచార్యులు అన్నారు. టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం గీతా ప్రచార సభ ఆధ్వర్యంలో గీతాజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత చదవడం వల్ల నైతిక విలువలు పెంపొందించుకోవచ్చన్నారు. భాస్కరభట్ల రామశర్మ మాట్లాడుతూ భగవంతుని తత్త్వం, ఆత్మ తత్వం, జీవన గమ్యాలను తెలిపే అంశాలు భగవద్గీతలో ఉన్నాయని చెప్పారు. అనంతరం భక్తియోగంపై పారాయణ, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఈఓ బి.మల్లేశ్వరరావు, పిలకా శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): క్రిస్మస్ సందర్భంగా బలగలో రాజు అనే యువకుడు నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. బావాజీ నగర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ ప్రవల్లిక మాట్లాడుతూ క్రీస్తుమార్గంలో సూచించిన విధంగా మంచిగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రాజ్‌కుమార్, ప్రభాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం



కాత్యాయిని

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని చిత్తరంజన్ వీధికి చెందిన ఓ వ్యక్తి తన తల్లి కనిపించడం లేదంటూ ఆదివారం రాత్రి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తరంజన్‌వీధిలో నివాసముంటున్న తోణంగి హరీష్‌కుమార్ బంగారం పనిచేస్తుంటాడు. తండ్రి చందనరావు నాలుగేళ్ల క్రితం గుండెపోటుతో చనిపోవడంతో తల్లి కాత్యాయని (64) మానసికంగా కుంగిపోయింది. అప్పటి నుంచి ఏం చేస్తుందో ఎక్కడికి వెళ్తుందో తెలియని పరిస్థితి. రెండు మూడు సార్లు బయటకు వెళ్లి మరళా వచ్చేసేది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం బయటకు వెళ్లి రాకపోవడంతో రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల బ్యాడ్మింటన్ పోటీలు



బహుమతులతో విజేతలు

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామ యూపీ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుల బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఆత్మీయ కలయికలో భాగంగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు 30 జట్లుగా విభజించి పోటీల్లో తలపడ్డారు. రాజాం మండలానికి చెందిన ఉపాధ్యాయులు గెలుపొందారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, రాజాం కల్కి జ్యువెలర్స్ అధినేత కొత్త మధుసూదనరావు ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పెంట గ్రామ సర్పంచ్ పున్నాన అక్కలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మక్క శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఆడుదాం..ఆంధ్రా'ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించున్న 'ఆడుదాం–ఆంధ్రా' క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో కె.నిర్మల కోరారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆమె మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలు జరిగే మైదానాల్లో మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. 26న జి.సిగడాం, పెంట, డి.ఆర్ వలస, వెలగాడ, 27న జగన్నాథవలస, ఆనందపురం, జాడ, సంతవురిటి, వాంద్రంగి, గెద్దకంచరాం, 28న బాతువ, దేవరవలస, నడిమివలస, సీతంపేట, 29న ఎందువ, పాలఖండ్యాం, నిద్దాం, పున్నాం, 30న మెట్టవలస, సేతుభీమవరం, టీడీ వలస చివాలయల్లో పరిధిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ఎంఎల్ఓ కీర్తి గౌరీశంకరరావు, పీడీ కొంచాడ బెనర్జీ ఉన్నారు.

భక్తిమార్గంలో పయనించాలి



సుధాకుమార్ శర్మను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలని ప్రముఖ తెలుగు పండితులు పి.సుధాకుమార్ శర్మ అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో భగవద్గీత ప్రవచనాలలో భాగంగా భగవద్గీత–భక్తిమార్గం అనే అశంపై ఆదివారం ప్రసంగించారు. దైవకర్మలను ఆచరించడం ద్వారా మోక్ష ప్రాప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు మోహనరావు, మల్లేశ్వరరావు, పులఖండం శ్రీనివాసరావు, బాబూరావు, సత్యవతి, లక్ష్మీ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల విజేత కాశీబుగ్గ



విజేతలకు బహుమతులు అందిస్తున్న పలాస ఆర్డీఓ భరత్‌నాయక్

మందస: మండలంలోని హరిపురంలో శ్రీపవనపుత్ర సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి 78 జట్లు పోటీలో పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీం కైవసం చేసుకోగా, ద్వితీయస్థానాన్ని బొరివంక, తృతీయస్థానాన్ని మందస గెలుచుకుంది. 4 నుంచి 10 స్థానాల వరకు లొహరిబంద, కొత్తపల్లి, పాత్తంగి–సిరిపురం, హరిపురం, గీతం టాలెంట్‌స్కూల్, కాశీబుగ్గ, కవిటి బృందాలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. విజేతలకు పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.పాపారావు, స్పెషల్ గెస్ట్ లెఫ్టినెంట్ కె.సంజీవరావు, డాక్టర్ ఆర్.చిన్నంనాయుడు, ఎంఈఓ ఎం.భాస్కరరావు, వ్యవసాయాధికారి జి.నాగరాజు, ఎం.పాపారావు, వై.సోమేశ్వరరావు, గేదెల నరేష్, కొంచాడ సత్యవీర్, పాట్నూరు రాజు, పవనపుత్ర సేవాసంస్థ సభ్యులు రుంకు తారకేశ్వరరావు, బిల్లింగి ప్రకాశరావు, మజ్జి శంకర్, బిన్నళ శివ, మర్రి చిరంజీవి, కె.ధనుంజయ, ఎ.బాలరాజు, శ్రీకాంత్, మజ్జి భాస్కరరావు, అనిల్, వినోద్ పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



రణస్థలం: పాతర్లపల్లిలో క్రైస్తవ బోధనలు చేస్తున్న ప్రేమ్‌కుమార్



లూథరన్ చర్చిలో సండే క్రిస్మస్ వేడుకలు

రణస్థలం: ప్రపంచ శాంతినికోరే క్రీస్తు బోధనలు అనుసరణీయమని పాతర్లపల్లి లూథరన్ చర్చి పాస్టర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. పాతర్లలపల్లి, మరువాడ చర్చిల్లో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రేమ, దయ, కరుణ శాంతియుత ఆయుధాలతో ఎటువంటి సమస్యనైన జయించవచ్చునని క్రైస్తవ తత్వం బోధిస్తోందన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్న క్రైస్తవులు శాంతిని కోరుకుంటారన్నారు. చర్చి సభ్యులు జాన్ విల్సన్, పి.అనిత, శాంతి చంద్రి పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని స్టేడియం సమీపంలో సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం సండే క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ టి.రాజ్‌కిరణ్ ఆధ్వర్యంలో మహిళా సమాజం, సండే స్కూల్ చిన్నారులు, యూత్ కలిసి క్రైస్తవ గీతాలు ఆలపించారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో హెన్రీ, జెనీమా, దేవయాని, ఫ్లోరా, వర్దనపు శామ్యూల్, రాజ్, శ్యాంసుందర్ మాస్టర్, సుధాకర్ రెడ్డి, సీహెచ్ పాల్, శ్రీవల్లి పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని ఉమెన్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వాతి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేస్తూ నగరంలో ఇటువంటి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో కె.వి.జె. రాధాప్రసాద్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, క్లబ్ జోన్ చైర్‌పర్సన్ బాడాన దేవభూషణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కె.సీజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో 50 ఏళ్ల క్రితం నివాసమున్న కుటుంబాల ఆత్మీయ కలయిక కోటేశ్వర ఏజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. ఆనాటి జ్ఞాపకాలు ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఆటపాటలతో అలరించారు. 80 ఏళ్ల సీనియర్ సభ్యులు నీలాంబను ఘనంగా సత్కరించారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, విశాఖపట్నం తదితర ప్రాంతాలను కుటుంబాలతో సహా రావడంతో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కన్న, సుందర్, రానప్ప, బాల, మురళీ, వి.కామేశ్వరరావు, ఘండికోట నాగేశ్వరరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంఎస్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎచ్చెర్ల క్యాంపస్: సైబర్ క్రైమ్‌లో భాగంగా ఎస్ఎంఎస్‌ల మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మాట్లాడుతూ.. ఫెస్టివల్ ఆఫర్లు, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పేరుతో ఫోన్‌లకు ఎస్ఎంఎస్‌లు వస్తున్నాయన్నారు. లింక్‌లు తెరిచాక బ్యాంకు ఖాతాలకు మళ్లిస్తున్నారని అన్నారు. యూపీఐ లావాదేవీల్లో కచ్చితమైన పిన్‌లు, పాస్ వర్డ్‌లు వినియోగించాలని సూచించారు. సోషల్ మీడియాలో వస్తున్న ఫేక్ మేసేజ్‌లుపై అప్రమత్తంగా ఉండాలని, వాటిని నమ్మకూడదన్నారు. సైబర్ క్రైమ్‌తో నష్టపోయిన డబ్బులు రికవరీ చాలా కష్టమన్నారు. అందుకు ముందుగానే జాగ్రత్తలు పాటించాలన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఎల్.ఎన్.పేట: భగవాన్ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీల్లో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. శ్యామలాపురం గ్రామంలోని సత్యసాయి మందిరం వద్ద ఆదివారం విజేతలైన విద్యార్థులకు సత్యసాయి జిల్లా గ్రామ సేవ ఇన్‌చార్జి మునగవలస రవీంద్రబాబు బహుమతులను అందజేశారు. రాష్ట్రస్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో లక్ష్మీనర్సుపేట, పూశాం, రావిచెంద్రి, కొమ్మువలస, కరకవలస గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలు, లక్ష్మీనర్సుపేట గ్రామంలోని కేజీబీవీ పాఠశాల నుంచి 25 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారని అన్నారు. సత్యసాయి భజన మండల కన్వీనర్ ఎ.నారాయణరావు, టి.దుర్గారావు, లావేటి శైలజ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యను అలవర్చుకోవాలి

పాతపట్నం: విద్యార్థులు సాంకేతిక విద్యను అలవర్చుకోవాలని పాతపట్నం, సారవకోట, హిరమండలం ఎంఈవోలు బి.శ్రీధర్, ఎం.వెంకటరమణ, కె.రాంబాబు అన్నారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న మహేంద్ర జూనియర్ కళాశాలలో మహేంద్ర టాలెంట్ టెస్ట్–2 ప్రతిభ పరీక్షను ఆదివారం నిర్వహించారు. 38 పాఠశాలకు చెందిన 792 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. డివిజన్‌స్థాయి టాలెంట్ టెస్ట్ పరీక్షల్లో అమర జ్యోతి పాఠశాలకు చెందిన విద్యార్థినులు బి.కవిత, బి.హరిక, జి.నీలమలు ప్రతిభ కనబర్చారు. విజేతలకు శాసనపూరి కామేశ్వరరావు ప్రతిభా పురస్కారాలను, సర్టిఫికెట్లు, షీల్డు ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్ ఎస్.మధుబాబు, ప్రిన్సిపాల్ ఎం.అంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చిత్తశుద్ధికి ధాన్యం కొనుగోలే నిదర్శనం

పోలాకి: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలే ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. డీఎల్ పురం సచివాలయం పరిధిలో రైతుభరోసా కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే నేడు వ్యవసాయాన్ని పండుగలా మార్చాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని చెప్పారు. దేశంలోనే ఆదర్శవంతంగా రైతుల కోసం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు అన్ని అందుబాటులోకి రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమౌతోందని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై ఎంతో అభిమానం ఉంది కాబట్టే అత్యంత ప్రాధాన్యత అంశాల్లో వ్యవసాయాన్ని మొదటిస్థానంలో ఉంచామని వివరించారు. రబీలో కూడా ఆరుతడిపంటకు శివారు కాలువలకు సైతం సాగునీరు అందించేందుకు వంశధార అధికారులు పూర్తిస్థాయి కసరత్తు చేస్తున్నారన్నారు.